

# కథా కౌముది

# అభిషేకం

గుడిపూడి శ్రీనివాస రావు

రేడియోలో 'పుష్పాంజలి భక్తి గీతాలు ' అని వినపడగానే స్కూల్ కి టైం అవుతోందని పుస్తకాల సంచి తీసుకొని చెప్పుల్లో కాళ్ళు సగం దూర్చి గబగబా బయల్దేరేను. స్కూల్ కి వెళ్ళేసరికి ప్రార్ధన మొదలవుతోంది . ఫణిగాడు వెనక చోటుందన్నట్టుగా సైగ చేసేడు. పరిగెత్తి వాడి వెనకాల లైన్లో దూరేను. ప్రార్ధన అయ్యాక అందరం క్లాస్ కి వెళ్ళేసరికి లెక్కల మాస్టారు కృష్ణమోహన్ గారు వస్తున్నారు. ఆయనంటే అందరికి హడల్. అంతా నిశ్శబ్ధంగా కూర్చున్నాం. అటెండెన్స్ తీసుకున్నాక క్లాస్ మొదలయ్యింది. మాస్టారు గారు బోర్డ్ మీద రాస్తుంటే అందరం శ్రద్ధగా చూస్తూన్నాం. ఇంతలొ అటెండరు రాములు 'సార్' అని పిల్చాడు. రాయడం పూర్తి చేసి తలతిప్పిన మాస్టారితో , జి.శ్రీనివాసు ని హెడ్మాష్టారు గారు రమ్మంటున్నారు సార్ అని చెప్పాడు. ఆశ్చర్యంగా లేచి నిలబడ్డాను నేను. 'పుస్తకాల సంచి కూడా తీసుకో' అన్నాడు రాములు. వెళ్ళమన్నట్టుగా సైగ చేసారు లెక్కల మాస్టారుగారు.

హెడ్మాస్టరు గారి గదికి వెళ్ళే సరికి ఆయనతో అమ్మమ్మ ఏదో మాట్లాడుతోంది. నన్ను చూసి పదరా నాన్నా బండికి టైమవుతోంది అంది . హెడ్మాస్టరు గారి కి నమస్కారం పెట్టి, స్కూల్ బయటకి వచ్చి, అటుగా పోతున్న రిక్షాని ఆపి, అందులో కూర్చున్నాక, రైల్వే స్టేషన్ కి పోనివ్వమంది అమ్మమ్మ. ఎందుకు నన్ను స్కూల్ నుంచి తీసుకెళుతున్నాదో అర్ధం కాని నాతో, 'రేపు మీ నాన్న అభిషేకం చేస్తున్నాడట , కార్తీక మాసం కదా,నిన్ను తీసుకొని రమ్మన్నారు' అని చెప్పింది అమ్మమ్మ. ఇంత ఉదయాన్నే మా నాన్న కబురు ఎలా పంపించారని అడిగాను అమ్మమ్మని. మీ పక్కింటి విమల వాళ్ళ అమ్మ ఇక్కడ జగన్నాధపురంలొ ఉంటుంది కదా, ఆవిడ కి వొంట్లో బావులేదట, చూడడానికని విమల నిన్న రాత్రి పాసింజరులో వచ్చిందట. వాళ్ళ తమ్ముడితొ కబురుపెట్టింది. నువ్వు ఇలా స్కూల్ కి వెళ్ళావు, ఆ అబ్బాయి అలా వచ్చాడు అంది.

స్టేషన్ దగ్గర రిక్షా దిగి టిక్కట్లు కొనుక్కుని మూడో నంబరు ప్లాట్ఫాం మీద ఉన్న కిరండూల్ పాసింజరు ఎక్కాం. కిటికీ పక్క సీట్లో నేను, నాపక్కన అమమ్మా కూర్చున్నాం. రైలు నెమ్మదిగా బయలుదేరింది. కిటికీకి అతుక్కుపోయి బయటకి చూస్తున్నాను. రైలు వేగం పుంజుకుంది. అమ్మ దగ్గరికి వెళుతున్నామన్న సంతోషంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. కిరండూల్ పాసింజరు కొత్తవలస స్టేషన్ దాటాక ఎడమ పక్క కెకె లైను వైపు తిరిగింది. మా ఊరు కరకవలస చేరాలంటె ఇంకా ఏడు స్టేషన్లు దాటాలి. కిటికీ లోంచి బయటకి చూస్తూ 'అమ్మమ్మా బొడ్డవర తర్వాత గుహలొస్తాయ్' అని అరిచాను.

అలాగే, చేతులు బయట పెట్టద్దు అంది అమ్మమ్మ. అప్పుడే ఎదుటి బెర్త్ మీద కూర్చున్న కుటుంబం తో మాటలు కలిపినట్టుంది. మా ప్రయాణానికి గల కారణాన్ని వాళ్ళకి వివరంగా చెబుతోంది.
"వీడు మా పెద్దమ్మాయి కొడుకు. మా అల్లుడు స్టేషన్ మాస్టర్ గా పనిచేస్తాడు. దీనికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగ పిల్లలు, మధ్యలో ఆడపిల్ల, వీడు ఆఖరివాడు. అతను పనిచేసే ఊళ్ళలో బడులు గట్రా పెద్దగా ఉండవు, అందుకని చదువు కోసం మగ పిల్లలిద్దరిని నా దగ్గర వదిలింది. కూతుర్ని అత్తవారింట్లో ఉంచి చదివిస్తోంది. వీడికి నాదగ్గర అలవాటైనా అప్పుడప్పుడు అమ్మకోసం బెంగపెట్టుకుంటాడు. అందుకే హెడ్మాష్టరు ని బతిమాలి తీసుకెళ్తున్నాను."

రైలు ఎస్.కోట స్టేషన్లో ఆగింది. ఇక్కడ అరటిపళ్ళు బాగా దొరుకుతాయి. పళ్ళు కొందామని అమ్మమ్మ కిటికీ దగ్గరగా జరిగింది. బుట్టలో అరటిపళ్ళతో పరిగెడుతున్న ఒకతన్ని ఆపి 'బాబు డజను ఎంతకిస్తున్నావ్' అని అడిగింది. 'ఐదు రూపాయలు, త్వరగా తీసుకోండమ్మా, బండి మూడు నిముషాలే ఆగుతుందిక్కడ' అరిచాడు వాడు. అర డజను ఇవ్వు అంటూ మూడు రూపాయలు ఇచ్చింది. ఇంతలో రైలు కదిలింది. పరిగెడుతూనే పళ్ళు, చిల్లర అర్ధ రూపాయి కిటికీలోంచి లోపలికి దాదాపు విసిరినంత పనిచేసాడతను. అమ్మమ్మ నా కోసం తెచ్చిన పెరుగన్నం లొ అరటిపండు వేసి ఇచ్చింది. ఎదురుగా కూర్చున్న వాళ్ళ అమ్మాయికి కూడా ఒక అరటిపండు ఇచ్చింది. నేను అన్నం తినేసి, మంచినీళ్ళు తాగేను. "తిరిగి ఎప్పుడొస్తాం?" అని అడిగాను అమ్మమ్మని. రెండు రోజులే, అభిషేకం అయిన మర్నాడు బయల్దేరిపోవాలని చెప్పింది. ఇంకో రెండు రోజులు ఉందాం అమ్మమ్మా అన్నాను. వొద్దునాన్నా , బడి పోతుంది. ఐనా రెండు నెలల్లో సంక్రాంతి శెలవలు వస్తున్నాయిగా అంది అమ్మమ్మ. కొంచెం నిరాశ గా మొహం తిప్పేను నేను.

రైలు బొడ్డవర స్టేషన్ దాటింది. దట్టమైన అడవిలో కొండల మధ్య నెమ్మదిగా వెళుతోంది. పెద్దగా శబ్దం చేస్తూ గుహలోంచి వెళుతున్నప్పుడు నేను గట్టిగా అరుస్తున్నాను. శివలింగపురం స్టేషన్ లో ఆగినప్పుడు , స్టేషన్ పక్కనే ఉన్న శివలింగానికి దండం పెట్టుకున్నాను. ఇక్కడ పనిచేసే మూర్తి గారు నాన్నకి మంచి ఫ్రెండ్. నన్నుచూసి నవ్వి ' రేపు వస్తానని నాన్నకి చెప్పు' అన్నారు. అలాగే అని తల ఊపాను. రైలు కదిలింది.

కిటికీలోంచి చూస్తూ ఆలోచనల్లోకి జారుకున్నాను. నాన్నకి పెద్ద ఊరు ఎప్పుడు బదిలీ అవుతుందో. అప్పుడింక అమ్మదగ్గరే ఉండి పోవచ్చు . అన్న ఎప్పుడూ అమ్మకోసం ఏడవడు. వాడికెప్పుడూ ఆటధ్యాసే. సెలవల్లో అమ్మదగ్గరికి వచ్చినా ఎంత త్వరగా వైజాగ్ వెళ్ళిపోదామా అని ఎదురు చూస్తుంటాడు. ఆలోచనల్లో మునిగిపోయిన నాకు బొర్రాగుహలు స్టేషన్ రావడంతో స్పృహ వచ్చింది. తార్వాతి స్టేషనే మా ఊరు కరకవలస. ఇంకో పావుగంటలొ ఇంటికెళతాం. కాన్నార్పకుండా మమ్మల్ని దాటి వెళుతున్న చెట్ల వైపు చూస్తున్నాను. రైలు మలుపు తిరిగి ఔటర్ సిగ్నల్ దాటింది. 'అమ్మమ్మా మా ఊరు వచ్చేసింది' అని గట్టిగా కేక పెట్టేను. రైలు మెల్లగా స్టేషన్ని సమీపించింది. నా కళ్ళు నాన్న కోసం వెతికాయి. ఎదురుగా ప్లాట్ఫాం మీద నాన్న కనపడగానే చేతులు ఊపాను.

రైలు ఆగగానే దిగి నాన్న దగ్గరికి వెళ్ళాను. 'ఏరా నాన్నా' అంటూ పలకరించారు నాన్న. 'ఇంద బాబు' అంటూ రెండు జాంకాయలు నా చేతిలో పెట్టేడు పోర్టర్ పైడితల్లి. అవి తీసుకొని ఇంటికి పరిగెత్తేను. 'ఉండు నాన్నా' అంటూ వెనకనించి అమ్మమ్మ అరుస్తోంది. కరకవలసలో స్టేషన్ కొండమీద , క్వార్టర్స్ కింద ఉంటాయి. స్టేషన్ బయటకి వచ్చి చూసాను. కింద మెట్ల కెదురుగా ఉన్న ఇంటి గుమ్మం ముందు నుంచొని ఎదురుచూస్తోంది అమ్మ. పరుగెడుతూ మెట్లు దిగుతున్నాను నేను. జాగ్రత్త అన్నట్టుగా అమ్మ చెయ్యి ఊపుతోంది. గబగబా వచ్చి అమ్మని చుట్టేసాను. నా తల నిమిరి ముద్దు పెట్టుకుంది అమ్మ.

మార్నాడు అభిషేకం అయ్యాక, భోజనాల దగ్గర నాన్న మూర్తి గారితో అంటున్నారు, 'పార్వతీ పురం లో డిగ్రీ కాలేజి కుడా వుందట, పెద్దవాడి చదువుకి ఇబ్బంది లేదు'. పరిగెత్తి వంటిట్లో కెళ్ళి అమ్మని అడిగాను 'నాన్న పార్వతీపురం అంటున్నారేమిటీ?' అమ్మ నా తల నిమిరి, 'అవున్రా , నాన్న అక్కడికి బదిలి అయ్యారు , వచ్చే ఏడాది స్కూళ్ళు తెరిచాక అందరం ఒక చోటే ఉండచ్చు, అమ్మవారు నా గోడు విన్నాది' అంటూ కళ్ళు తుడుచుకుంది. నేను ఒక్క ఉదుటున వీధిలొకెళ్ళి జామచెట్టు ఎక్కి అంతేవేగంగా దూకేసాను. పక్కింటి పిళ్ళై మేష్టారు ఆశ్చర్యం గా చూసేరు నా వైపు ఏవైందన్నట్టు.

Click here to share your comments